www.ninadam.co.in
# నినాదం
నిఖార్సైన జర్నలిజం
సోమవారం 27-5- 2024 తెలంగాణ ప్రాంతీయం పేజీలు : 08

## వేపచెట్టుకు మామిడికాయలు..! ఆశ్చర్యపోతున్న జనం..!



ప్రకృతిలో ఎన్నో వింతలు జరుగుతుంటాయి. ఇవన్నీ చూపరులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. తాజాగా మధ్యప్రదేశ్‌లో జరిగిన ఘటన అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తున్నది. ఓ వేప చెట్టుకు మామిడికాయలు కాశాయి. వేప చెట్టుకు మామిడి కాయలు ఏంటీ అనుకుంటున్నారా? ఇది నిజమండి బాబు.. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నది. వివరాల్లోకి వెళితే.. భోపాల్‌లోని పంచాయతీ గ్రామీణాభివృద్ధి, కార్మికశాఖ మంత్రి ప్రహ్లాద్ సింగ్ పటేల్ అధికారిక నివాస ప్రాంగణంలో వేప చెట్టు ఉన్నది. ఈ వేప చెట్టుకు మామిడికాయలు కనిపించాయి.

# అర్ధరాత్రి అక్రమ మైనింగ్

## నో పోలీసు నో రెవెన్యూ నో ఇరిగేషన్



ప్రత్యేక ప్రతినిధి మే 26( నినాదం న్యూస్) : పెద్దపల్లి జిల్లాలోని అదో పెద్ద చెరువు, దీనికి కూతవేటు దూరంలోనే తహసీల్దారు కార్యాలయం, పోలీసు ఠాణాలుంటాయి. అయినా ఓ ముఠా అర్ధరాత్రి అక్రమ మైనింగ్ సాగిస్తూ దర్శనమిస్తుంది. అటుగా వెళ్తున్న సివిలియన్లు చూసి సంబంధిత బాధ్యులకు ఫోన్ ద్వారా అనేక సార్లు కాల్ చేస్తారు. అయినా ఏ ఒక్కరూ స్పందించరు. గత పదేళ్లుగా ప్రతిష్టాత్మకంగా పనిచేసిన డయల్ 100 సైతం దమ్ముకోల్పోయింది. సుమారు గంటన్నర వ్యవధిలో ఆరు సార్లు కాల్ చేసిచెబితే స్థానిక సిబ్బంధి నుండి ఏ స్పందనా లభించలేదు. చివరగా ఏడో ప్రయత్నానంతరం సదరు చెరువులో ఓపెన్ కాస్టును తలపించిన లైట్లు మాత్రం ఆర్పబడ్డాయి. ఇంతకీ అది ఏ మండలంలోని ఏ ఊరి చెరువు? అక్కడ జరుగుతున్న తతంగమేంటి? దానివెనుకున్న అధికారి ఎవరు అనే **పూర్తి వివరాలు**

నినాదం తరువాతి సంచికలో.....

## ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తాం : ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి



మల్కాజిగిరి : ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తామని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. ఆదివారం మచ్చ బొల్లారం డివిజన్ లాలాషా బస్తీ, తుర్కపల్లిలోని సమస్యలు పరిష్కరించాలని పలువురు నాయకులు ఎమ్మెల్యేని కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. డ్రైనేజీ, సీసీ రోడ్లు, స్ట్రీట్ లైట్లవంటి మౌలిక సదుపాయాలు కల్పిస్తామని అన్నారు. అధికారులతో సర్వే చేయించి నివేదికలు ప్రభుత్వానికి అందజేస్తామని, నిధులు మంజూరైన వెంటనే అభివృద్ధిపనులను ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆతిక్‌పాషా, జావెద్, అఫ్జల్, సికిందర్, గౌసుద్దీన్, రషీద్, యాస్మిన్, ఇమ్రాన్, సాదిక్, ఆజాం, కాజాపాషా, మంద శోభన్‌బాబు, దేవా, ఈశ్వర్, వినోద్, కిట్టు, రమేష్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

## మధుమేహ వ్యాధి పట్ల అవగాహన తప్పనిసరి : జస్టిస్ ఎన్‌వి రమణ



**కొండాపూర్ :** మధుమేహ వ్యాధి పట్ల ప్రజలు సరైన అవగాహన కలిగి ఉండాలని భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వి రమణ అన్నారు. ఆదివారం ఫిల్మ్‌నగర్‌లోని జేఆర్‌సీ కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన డయాబెటిస్ ఎక్స్‌పో-2024కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వ్యాధి దరిచేరకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు , వచ్చాక పాటించాల్సిన నియమాలపై ప్రత్యేక అవగాహన కలిగి ఉండాలని సూచించారు. మధుమేహ వ్యాధి చాపకింద నీరులా విస్తరిస్తుందని, దేశంతో పాటు హైదరాబాద్ నగరంలో వ్యాధి తీవ్రత పెరుగుతుందన్నారు. యువత, చిన్న పిల్లలు సైతం మధుమేహ వ్యాధికి గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మారుతున్న జీవన విధానాలు, ఆహారపు అలవాట్లు ప్రధాన కారణంగా మారుతున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ ఆహార నియమాలు, వ్యాయామాలు పాటించాలని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ చైర్మన్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి, డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్ చైర్మన్ డాక్టర్ కె సతీష్‌రెడ్డి, ప్రొఫెసర్ బీకే సహాయ్, డాక్టర్ వీ మోహన్, డాక్టర్ ఆర్ఎం అంజన తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో భారీ వర్షాలు..

**వేర్వేరు ఘటనల్లో పది మంది మృత్యువాత..**

తెలంగాణలోని పలు జిల్లాల్లో ఆదివారం సాయంత్రం ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. ఈదురుగాలులకు పలుచోట్ల చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దాంతో పలుచోట్ల విద్యుత్ సరఫరాలో అంతరాయం నెలకొన్నది. వర్షాలకు వేర్వేరు ఘటనల్లో పది మంది మృతి చెందారు. దీంతో మృతుల కుటుంబాల్లో విషాదం అలుముకున్నది. నాగర్ కర్నూలు జిల్లాలో ఆదివారం వర్షం కురిసింది. తాడూరు మండలం ఇంద్రకల్ గ్రామ శివారులో షెడ్ నిర్మాణంలో ఉండగా.. సాయంత్రం వర్షానికి గోడ కూలిపోయింది. ఈ ఘటనలో నలుగురు మృతి చెందారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. మృతుల్లో కోళ్ల ఫామ్ యజమానితో పాటు అతని కుమార్తె, ఇద్దరు కూలీలు చనిపోయారు. మృతులను కోళ్లఫామ్ యజమాని మల్లేశ్ (40), అతని కూతురు అనూష (10), కూలీలు చెన్నమ్మ, రాము మృతి చెందారు. కూలీలు చెన్నమ్మ, రాము స్వస్థలం పెద్దకొత్తపల్లి మండలం ముష్టిపల్లి. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు చోటు చేసుకున్నాయి. మృతదేహాలను జిల్లా ఆసుపత్రికి తరలించారు. అలాగే, తెలకపల్లిలో పిడుగుపాటుకు ఓ బాలుడు ప్రాణాలు కోల్పోయాడు. నందివడ్డెమాన్ గ్రామంలోనూ ఓ వ్యక్తి మృతి చెందాడు. మరో వైపు నాగర్‌కర్నూల్, పాలెం, బిజినేపల్లి, తిమ్మాజిపేట, చెన్నపురా



వుపల్లి, కల్వకుర్తి, పదర, పెద్దూరు, తూడుకుర్తిలాంటి పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిశాయి. ఇదిలా ఉండగా.. కీసరలో ఈదురుగాలులకు చెట్లకొమ్మలు విరిగిపడ్డాయి. ఈ ఘటనలో ఇద్దరు మృతి చెందారు. తిమ్మాయిపల్లి నుంచి షామీర్‌పేట వెళ్లేదారిలో చెట్టు విరిగిపడింది. దాంతో రాంరెడ్డి, ధనుంజయరెడ్డి అనే ఇద్దరు మృతి చెందారు. రాంరెడ్డి సంఘటనా స్థలంలోనే ప్రాణాలు విడువగా.. చికిత్స పొందుతూ ధనుంజయరెడ్డి కన్నుమూశాడు. మృతుల స్వస్థలం యాదాద్రి జిల్లా బొమ్మల రామారంగా గుర్తించారు. సిద్దిపేట జిల్లాల్లోనూ వర్షాలకు గోడకూలి మరో ఇద్దరు ప్రాణాలు వదిలారు. ములుగు మండలం క్షీరసాగర్‌లో కోళ్లఫారం కోడకూలింది. ఇదే ఘటనలో మరో ముగ్గురికి గాయాలయ్యాయి.